క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మనుబోలు : మండల పరిధిలోని కండలేరు కాలువ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను నెల్లూరు టు టౌన్ సెబ్ సీఐ వెంకటేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. మనుబోలు పరిధిలో జాతీయ రహదారిపై శనివారం తనిఖీలు చేస్తుండగా, ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను నిలిపి పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

పరస్పర కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇరువర్గాలపై బాలాజీనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్ గీతాంజలి స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న సుమ అలియాస్ శంకరమ్మ, సుధమ్మ మధ్య పాదుపు లోన్ల విషయంలో విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వీరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

కులం పేరుతో దూషణ

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడుకు చెందిన వెంకటేశ్వర్లు మాగుంట లేఅవుట్లోని లెక్చరర్స్ కాలనీలో నివాసం ఉంటున్న కమలాకర్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. యజమాని ఇంట్లో పనులు ముగించుకున్న అనంతరం వెంకటేశ్వర్లు తన సహచరులైన మహేష్‌బాబు, ఉపేంద్రతో కలిసి ఎంజీబీ మాల్‌కు శుక్రవారం బయల్దేరారు. మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి యజమాని స్నేహితుడైన వేణుగోపాల్‌రెడ్డి తారసపడ్డారు. తమ యజమానిపై తప్పుడు కేసు పెట్టావు అని వెంకటేశ్వర్లు అడిగారు. దీంతో ఆయన్ను కులంపేరుతో వేణుగోపాల్‌రెడ్డి దూషించి దాడి చేశారు. అడ్డుపోయిన మహేష్‌బాబు, ఉపేంద్రపై సైతం దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు.

నాణ్యత ప్రమాణాలను పాటించాలి



పరిశీలిస్తున్న హరిత

నెల్లూరు సిటీ: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీని శనివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. నిర్దేశించిన అభివృద్ధి పనులను అమెనిటీస్ కార్యదర్శులు పర్యవేక్షించాలని కోరారు. కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ జిల్లా జట్ల ఎంపికలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విలువిద్య పోటీలు, ఎంపికలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి వేణు మాట్లాడారు. మహిళల ఇండియన్ రౌండ్‌లో హర్షిణి, లక్ష్మీప్రశాంతి, మౌనిక, తనూష, పురుషుల ఇండియన్ రౌండ్‌లో మనోజ్‌కుమార్, వెంకటలోకేష్, భాగ్యరాజ్, పురుషుల రికర్వ్ రౌండ్‌లో తరుణీష్ జైత్య, సాయిమౌర్య, శ్రీనాథ్, నూతన్, రాజశేఖర్, శ్రీనివాస్ ఎంపికయ్యారని వివరించారు. విజయవాడలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న అంతర్ జిల్లాల ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహర్ష, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు బీజేవైఎం చేయూతనందిస్తోందని ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవాన్ని శనివారం జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి నెలా క్రీడా పోటీలను నిర్వహించనున్నారని వివరించారు. అనంతరం విజేతలైన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, జెనెక్స్ కాలేజీ జట్లకు జ్ఞాపికలు, రూ.82 వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘునందన్, విజయలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న నిమ్మ మార్కెట్

- బస్తా కాయలు రూ.4,500
- మార్చి నాటికి మరింత పెరిగే అవకాశం



కాయలను గ్రేడింగ్ చేయిస్తున్న వ్యాపారులు

పొదలకూరు : నిమ్మమార్కెట్ ఫిబ్రవరి నుంచే ఊపందుకుంటోంది. నాలుగు రోజులుగా కాయల ధరలు ఎగబాకుతున్నాయి. లూజు బస్తా ఒక్కటింటికి రూ.3,600 నుంచి రూ.4,500 వరకు ధర పలికినట్లు వ్యాపారులు చెప్పారు. కిలోల వంతున చూస్తే రూ.45 నుంచి రూ.57 వరకు ధరలు పలుకుతున్నాయి. చలితీవ్రత ఉన్నా బయటి ప్రాంతాల నుంచి కాయల ఎగుమతి లేకపోవడం వల్ల ఫిబ్రవరిలోనూ ధరలు పెరుగుతున్నాయి. ఢిల్లీ మార్కెట్‌లో కాయల ధరలు ఆశాజనకంగా ఉండడంతో మార్చి నాటికి ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది పండు కాయల ధరలు కూడా పెరిగాయి. నాణ్యత కలిగిన పచ్చికాయల(గ్రీన్ కలర్)కు మాత్రమే డిమాండ్ బాగా పెరుగుతోంది. గతేడాది ఎడతెరిపి లేని వర్షాల వల్ల తోటల్లో వర్షపు నీరు నిలిచి రైతులు కష్టాలు ఎదుర్కొన్నా ధరలు విపరీతంగా పెరిగి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

శివరాత్రి వల్ల

ప్రతి ఏడాది మహాశివరాత్రికి ముందు నిమ్మకాయల ధరలు పెరుగుతుంటాయి. శైవక్షేత్రాల్లో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు విపరీతంగా నిమ్మకాయలను వినియోగిస్తారు. ఫలితంగా ఉత్తర భారతదేశానికి కూడా కాయలు ఎగుమతి అవుతుంటాయి. దీంతో పొదలకూరు మార్కెట్ నుంచి ప్రస్తుతం ప్రతి నిత్యం పది లారీల కాయలు ఎగుమతి జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం నకిరేకల్ మార్కెట్, కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ వంటి పెద్ద మార్కెట్ల నుంచి కూడా నిమ్మ ఎగుమతులు ఆశించిన స్థాయిలో లేవు. ఫలితంగా పొదలకూరు మార్కెట్‌కు డిమాండ్ పెరిగింది.

బయటి ప్రాంతంలో మంచి డిమాండ్



నిమ్మధరలు మార్చిలో పెరిగే అవకాశం ఉంది. పొదలకూరు నిమ్మకు బయటి ప్రాంతంలో డిమాండ్ ఏర్పడింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటకల నుంచి కాయల ఎగుమతి తగ్గింది. మన ప్రాంతంలో గతేడాది భారీ వర్షాలు కురిసినా నిమ్మమార్కెట్‌పై ప్రభావం చూపలేదు.

– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మమార్కెట్ యార్డు

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



కొడవలూరులో నాగేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న



బుచ్చిరెడ్డిపాళెం : వెంకటరమణారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

కొడవలూరు : మండలంలోని దామేగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొట్టే మల్లికార్జున తండ్రి వెంకటశేషయ్య ఇటీవల మృతిచెందారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దామేగుంటలోని మల్లికార్జున నివాసానికి శనివారం వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు చిమటా శేషగిరిరావు, ఆర్.వెంకటేశ్వర్లునాయుడు, ఎ.వెంకటరత్నం ఉన్నారు.

- కొడవలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కొప్పోలు నాగేశ్వరరావు భార్య మాధవి ఇటీవల మృతి చెందారు. దీంతో వారి నివాసానికి ఎమ్మెల్యే ప్రసన్న శనివారం వెళ్లి నాగేశ్వరరావును పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నేతలు పి.రవి, ఎస్.తిరుపతమ్మ, పి.మురళి, ఒ.సునీతమ్మ, ఎస్.నాగేశ్వరరావు ఉన్నారు.
- బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి మండలం, రేబాల గ్రామానికి చెందిన పెన్నా డెల్టా మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తండ్రి యర్రంరెడ్డి వెంకటరమణారెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో వారి నివాసానికి ఎమ్మెల్యే ప్రసన్న వెళ్లి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించడంతో పాటు వెంకటరమణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నేతలు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, కోడూరు మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచ్ భాగ్యలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

14 నుంచి శివరాత్రి మహోత్సవాలు

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి వద్ద ఉన్న పార్వతీ సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పెంచలప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా గ్రామస్తులు, దాతల సహకారంతో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు.

ఈపూరుకు కమ్యూనిటీ హాలు

ముత్తుకూరు : మండలంలోని ఈపూరు గ్రామానికి కమ్యూనిటీ హాలు మంజూరైనట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత అనంతరాజు వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో కమ్యూనిటీ హాలు మంజూరైందన్నారు. నుడా నిధులు రూ.30 లక్షలతో దీని నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు.

వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మీ గోదాదేవి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం తిరిగి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా పోటీలు

కొడవలూరు : మండలంలోని చింతచెలిక వద్ద ఉన్న ఓవెల్–18 పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం నిర్వహించిన ఆటల పోటీలు ఆసక్తిగా సాగాయి. వాలీబాల్, షటిల్, క్రికెట్, జావెలిన్ త్రో, షాట్ పుట్, చెస్, కేరమ్స్, త్రోబాల్, టెన్నీ కాయిట్, రంగోలి, మ్యూజికల్ చైర్స్, కపుల్ వాక్, మెహంది, ఫుడ్ కోర్ట్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రిన్సిపల్ పి.హరిబాబురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.సునీత, పీఈటీ ప్రవల్లిక పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



పొలాల్లోకి ఒరిగిపోయిన బస్సు

కొడవలూరు : టైరు పంక్చర్ కావడంతో ఆర్టీసీ బస్సు వరి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన కొడవలూరు మండల పరిధిలోని బసవాయపాళెం వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకొంది. ఎస్సై జి.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. బోగోలు మండలం, చెన్నారాయునిపాళెం నుంచి అల్లూరు మీదుగా నెల్లూరుకు వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు కొడవలూరు మండలం బసవాయపాళెం వద్దకు రాగానే, ముందు టైరు పంక్చరైంది. దీంతో బస్సు అదుపుతప్పి వరి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 75 మంది ప్రయాణికులు ఉన్నారు. అదుపుతప్పిన బస్సు పొలాల్లోకి వెళ్లినప్పటికీ బోల్తా పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. వారిని మరో ఆర్టీసీ బస్సులో ఎక్కించి పంపారు.

వైద్యుల నిర్లక్ష్యం.. పేదలకు శాపం

కోవూరు మండలం, చిన పడుగుపాడు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే రక్త పరీక్షలు బయట చేసుకోమని పంపారు. అయితే సదరు వ్యక్తి బయట పరీక్షలు చేయించుకునేందుకు బిల్లు చెల్లించాలని వైద్యులను నిలదీయడంతో విధిలేని పక్షంలో వైద్యాధికారిణి రూ.1,800 చెల్లించింది. కేవలం ఇది ఒక వ్యక్తికే కాకుండా అక్కడ పరీక్షల కోసం వచ్చే వారిని బయట ల్యాబ్‌లకు పంపడం సర్వసాధారణంగా మారింది.

- నిరుపయోగంగా సీరం ఎలక్ట్రోలైట్స్
- దీని విలువ సుమారు రూ.8 లక్షలు



కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం

కోవూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ.లక్షలు ఖర్చు చేసి విలువైన పరికరాలను అందజేసింది. అయితే వైద్యుల నిర్లక్ష్యం కారణంగా వాటిని సరిగ్గా వినియోగించకపోవడంతో లక్షలు విలువ చేసే పరికరాలు నిరుపయోగంగా మారాయి. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొన్ని మాసాల నుంచి రూ.8 లక్షల విలువ చేసే సీరం ఎలక్ట్రోలైట్స్, అలాగే రూ.5 లక్షల విలువ చేసే సీబీపీ మెషిన్ను నిరుపయోగంగా వదిలివేశారు. వీటికి ఉపయోగించే కెమికల్ కేవలం రూ.3 వేలు నుంచి రూ.5 వేలు ఖర్చు చేస్తే ఆ రెండు పరికరాలు అద్భుతంగా పనిచేస్తాయి. వైద్యారోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగా విలువైన పరికరాలు మరుగున పడిపోయాయి.



సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయక నిరుపయోగంగా ఉన్న సీరం ఎలక్ట్రోలైట్స్ మెషీన్

పరీక్షలు గణనీయంగా తగ్గిన వైనం

గతంతో పోల్చుకుంటే కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయడం గణనీయంగా పడిపోయింది. కోవూరు జాతీయ రహదారి సమీపంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో ఏ ప్రమాదం జరిగినా ఇక్కడి వైద్యశాలకు వస్తుంటారు. నెల క్రితం కూడా కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి దాదాపు రూ.18 లక్షలు ఖర్చు చేసి రక్త పరీక్షలు చేసే ఒక పరికరాన్ని కొనుగోలు చేశారు. అది ఇప్పటికీ ఆస్పత్రి వరండాలో ఉంది. ఉన్నతాధికారులు కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఇక్కడ ఉన్న లక్షలాది రూపాయలు విలువ చేసే పరికరాలు వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న సీబీపీ పరికరం

లోపాలను సరిచేస్తాం

ప్రస్తుతం వైద్యశాలలో సీరం పరీక్షలు చేసే పరికరంలో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయాలి. వైద్యశాలలో పరీక్షలు ఎక్కువగానే చేస్తున్నాం. ఎవరూ బయటకు వెళ్లాల్సిన పనిలేదు. కొన్ని లోపాలు ఉన్నాయి, వారిటి సరిచేస్తాం.

– డాక్టర్ విజేత, సూపరింటెండెంట్

లోక్ అదాలత్‌లో 1,247 కేసుల రాజీ

- రూ.39.74 లక్షల రికవరీ



మాట్లాడుతున్న న్యాయమూర్తి

కోవూరు : కోవూరు కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 1,247 కేసులు పరిష్కారమైందని, వీటికి సంబంధించి రూ.39.74 లక్షలు రికవరీ చేసినట్లు సీనియర్ సివిల్ జడ్జి సి.మురళీధర్ తెలిపారు. అందులో సివిల్ 21, క్రిమినల్ 122, బ్యాంక్ 1,035, ఇతర కేసులు 69 ఉన్నాయన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మ, అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె.కాత్యాయిని, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్షణికావేశం తగ్గించుకోవాలి

పలు గొడవలకు క్షణికావేశంలో చేసిన పొరపాట్లే ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, వాటి కారణంగా జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి అన్నారు. కోవూరులో జరుగుతున్న లోక్ అదాలత్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. కక్షిదారులకు లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని, పరిష్కారం వీలు కలిగే కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఆయన వెంట సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సైలు వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

శరవేగంగా పైపులైన్ పనులు



గ్రామంలోని ఓ వీధిలో పూర్తి కావస్తున్న పనులు



గుంతల్లో ఏర్పాటు చేసిన పైపులైన్

- మంత్రి కాకాణికి గ్రామస్తుల కృతజ్ఞతలు

వెంకటాచలం : మండలంలోని కాకుటూరులో తాగునీటి కోసం పైపులైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాకుటూరు గ్రామంలోని కొన్ని వీధుల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో తాగునీటి సరఫరా కావడంలేదు. ఈ విషయాన్ని స్థానికులు ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి పైపులైన్ సమస్యను తీసుకెళ్లారు. వెంటనే అధికారులతో మాట్లాడి కాకుటూరులో అన్ని వీధుల్లో పైపులైన్ పనులు చేపట్టి, ఇంటింటికి తాగునీరు సరఫరా చేసేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.40 లక్షల మంజూరు చేయించారు. దీంతో కాకుటూరులో పైపులైన్ నిర్మాణ పనులను అధికారులు శరవేగంగా చేస్తున్నారు. తాగునీటి సరఫరా కోసం గ్రామానికి రూ.40 లక్షలు మంజూరు చేయించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వార్షిక వేడుకలు ప్రారంభం



పవిత్ర జలాన్ని తీసుకొస్తున్న మహిళా భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని దుర్గానగర్‌లో కొలువైన కనకదుర్గా అమ్మవారి ఆలయ పదో వార్షిక వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 14వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా తొలిరోజు శనివారం మహిళా భక్తులు 108 కలశాలతో పవిత్ర జలాలను తీసుకుని ఉత్సవంగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆక్రమణలను వెంటనే తొలగించాలి



మాట్లాడుతున్న సీఐ రాంబాబు, ఎస్సై ఆంజనేయులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : మండలంలోని రామతీర్థంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని దళిత సంఘాల నేతలు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దళిత నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని దుకాణాలను నిర్మించుకున్నారని తెలిపారు. దీనిపై ఇప్పటికే దుకాణదారులకు ఆక్రమణలను తొలగించాలని కోరినా ఫలితం లేకపోవడంతో ఆందోళన చేపట్టామన్నారు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం సీఐ రాంబాబు, విడవలూరు ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు. కార్యక్రమంలో దళిత నేతలు ఎల్లు సాల్మన్‌రాజు, పొంగులూరు ప్రసాద్, ముసలి నరేంద్ర, దానం మాత్యాద్రి, సుధాకర్, కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు సర్వం సిద్ధం



సర్వాంగ సుందరంగా ముస్తాబైన నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల

- నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో పోటీల నిర్వహణ

ఇందుకూరుపేట : నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో 98వ కోవూరు జోన్ గ్రిగ్స్ క్రీడా పోటీలు మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ప్రారంభం కానున్నాయి. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆర్థిక సహకారంతో, స్థానిక నేత దువ్వూరు కల్యాణ్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో మూడు రోజుల పాటు పోటీలు జరుగనున్నాయి. వీటి నిర్వహణ ఏర్పాట్లపై కమిటీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీలత, కార్యదర్శి ఎం.పల్లవి శనివారం మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చి, కొడవలూరు, విడవలూరు మండలాల నుంచి 37 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. 31 అథ్లెటిక్స్, 35 క్రీడలకు సంబంధించి జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. విజేతల కోసం సుమారు వెయ్యి బహుమతులు, ప్రశంసా పత్రాలను సిద్ధం చేసినట్లు చెప్పారు.



పోటీలకు సిద్ధమైన క్రీడా మైదానం

తొలిరోజు అథ్లెటిక్స్

50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పోటీల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశారు. తొలిరోజు అథ్లెటిక్స్, రెండు, మూడు రోజుల్లో గేమ్స్ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. క్రీడా పోటీలను వీక్షించేందుకు భారీ స్క్రీన్‌ను సైతం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన వసతి కల్పించినట్లు వారు వివరించారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు కోరారు.